

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఉదయం నేను** లేచేసరికి అన్నయ్య ఆఫీసుకి వెళ్ళిపోయాడు. జెట్‌లాగ్ తగ్గినా, లేవగానే ఎక్కడున్నానో ఒక రెండు క్షణాల వరకు తోచలేదు. ఇలా ఇంకా ఎన్నిరోజులు 'ఎక్కడ ఉన్నాను?' అనుకోవాలో ఏంటో అంటూ మంచం దిగాను. ఏదో తేడాగా ఉంది. ఏదో తేడాగా అనిపించింది. బహుశా అన్నయ్య లేకుండా మొదటిసారి రోజంతా వంటరిగా ఉండబోతున్నాననేమో. పళ్ళుతోముకుంటుండగా అద్దంలోని నా మొహం మీద అన్నయ్య అతికించిన పోస్ట్ ఇట్ కనిపించింది.

'అమ్మకి ఫోన్ చెయ్యి. ఆకలేసినప్పుడు ఫ్రిడ్జ్‌లోవి తిను. టీవీలో సినిమాలు చూసుకో, ఏమైనా అవసరం వస్తే నాకు ఫోన్ చెయ్యి' అని రాసుంది. రోజంతా బోర్ కొట్టే ఛాన్స్ లేదు. పగలు పూట కాబట్టి భయంలేదు. అందుకే ఏదో భారం తగ్గినట్టు అనిపిస్తుందేమో. అమ్మ పడుకోడానికి ఇంకా రెండు గంటలుంది కాబట్టి స్నానం సంధ్య పూర్తిచేసి దీపం వెలిగిద్దామనుకున్నాను. కొప్పు పెడదామని జుట్టుని చేతిలోకి తీసుకున్నప్పుడు తెలిసింది. లేచినప్పటినుండి అనిపించిన తేడా పొడుగు జుట్టులేకపోవడం. భుజాలమీద పడుతూ కాస్త చీదరగా కాక తెలీకుండానే ప్రశాంతంగా లేచాను. అది గ్రహించగానే తెలియకుండా చిరునవ్వు వికసించింది. పోస్టిట్ తీసి

అద్దంలో ఓ పదినిమిషాలు నా జుట్టుని ఆరాధిస్తూ ఉండిపోయాను. అమ్మ నిద్రపోకుండా ఫోన్ చెయ్యాలని గబగబా మిగతా పన్లు పూర్తి చేసి కార్డ్‌లెస్ ఫోన్‌లో యధావిధిగా రీ డయల్ నొక్కాను. అమ్మ గొంతు విన్నాక ఈసారి ఏడుపు రాలేదు. ఉత్సాహంగా నా జుట్టుని కత్తిరించిన కథ, ఆ కత్తిరించిన జుట్టుని దానం చేసిన కథ చెప్పాను.

"అన్నయ్య నీ ఫోటోని పంపాడు. ఎంత ముద్దుగా ఉన్నావో చిన్నపిల్లలాగా."

"నువ్వు కోప్పడతావనుకున్నా"

"ఏమీ?"

"జుట్టు కత్తిరించాను కదా"

"అయితే? నీకు బావుంది పొట్టి జుట్టు. కాలేజీ మొదలయ్యాక నూనె రాయడం, ఎగ్ పూయడంలాంటి వాటికి టైంలేక పోషణ తగ్గుతుంది. అలా చీపిరి కట్ట జుట్టుకన్నా ఇదే సుబ్బరంగా ఉంటుంది."

మా అమ్మ ఇంత మోడర్న్ ఎప్పుడయ్యిందబ్బా అని ఎంతో ఆశ్చర్యపోయాను.

"పెద్దమ్మ చూసి ఇంత చిన్నపిల్ల ఒక్కతే ఎలా ఉంటుందో? పోనీ వెనక్కి రమ్మని వచ్చే ఏడాది పంపించు" అంది.

"జుట్టు పొడుగ్గా లేకపోవడంవల్ల అలా కనిపిస్తున్నాను. నాకు ట్వెంటీ ఇయర్స్. నా వయస్సులో నీకు పెళ్ళి కూడా అయిపోయింది నేను బానే ఉంటానులే. దిగులుపడకండి"

"సరేలే బడాయ్ బచ్చా. రాత్రికి పెద్ద నాన్నకి ఫోన్ చెయ్యి. నువ్వు చేరినప్పటినుండి మాట్లాడలేదని వాపోయాడు."

"ఓ రాత్రికి చేస్తా. నాకసలు తట్టలేదు."

"అలాగే అమ్మమ్మ, తాతయ్యతో కూడా మాట్లాడు"

"మరి పిన్నితో?"

"ఏం అక్కర్లేదు."

"అదేంటి? ఎప్పుడూ మాట్లాడమని విసిగించేదానివి కదా?"

"జుట్టు కత్తిరించుకున్నావని తెలిసి అమెరికాకి వెళ్ళగానే షోకులు పెరిగాయని అందరితో కలిసి హేళన చేసిందట. తనతో నువ్వు ఇంక మాట్లాడకు. దుష్టులకి దూరంగా ఉండాలి."

"ఓ. సరే అయితే"

"మంచివాడు మంచివాడు అంటే మంచం విరక్కొట్టినట్టు చేసింది."

"పోనీలే. వదిలేసెయ్ నువ్వు కూడా మాట్లాడకు ఇంక"

"అంతే చేస్తా. పేరంటానికి పిలుస్తుంది కదా మళ్ళీ ఫోన్ కూడా ఎత్తను."

"సర్లే. ఇంతకీ అన్నయ్య నా గురించి ఏమైనా కంప్లైంట్స్ చెప్పాడా?" టాపిక్ మార్చే ప్రయత్నం చేసాను.

"ఏమ్మా?"

"నిన్నంతా సోఫాలోనే ఉన్నాను. ఒక్క పనికూడా చెయ్యలేదు. అన్నయ్యకి ఏమైనా కోపం వచ్చిందేమో అని"

"ఛీ ఛీ. అస్సలు లేదు. నిన్ను చాలా మెచ్చుకున్నాడు."

"మెచ్చుకున్నాడా? దేనికి?"

"తనకి తెలిసిన అమ్మాయిల్లా కాక నువ్వు చాలా ప్రాక్టికల్ అండ్ సింపుల్‌గా ఉన్నావట. మంచి ఫోన్ కొంటా అంటే వద్దని చీప్‌ది తీసుకున్నావట. హెయిర్ కట్‌కి కూడా అబ్బాయిల సెలూన్‌కి తీసుకెళితే సరే అని కట్ చేయించుకున్నావట. పేచీ పెడతావనుకుని భయపడ్డాడట"

"ఔనా? నాకు చెప్పలేదే?"

"ఏమో మరి."

"ఇంకేమన్నాడు?"

"నువ్వేదో నవలని ఎత్తిన తలదించకుండా చదివేసావట? చదవడం మొదలు పెట్టినప్పుడు కనీసం పదినిమిషాలైనా చదువుతావో లేదో అనుకున్నాడట. కానీ రోజంతా కూర్చుని పట్టువదలని విక్రమార్కుడిలా చదివేసావట. నీ కాన్సన్‌ట్రేషన్‌ని మెచ్చుకున్నాడు."

"ఔనా? మరి నాకు క్లాస్ పీకాడు?"

"ఏమో మరి. నాకు చెప్పింది నీకు చెప్తున్నా."

"ఇంకేం చెప్పాడు?"

"ఇంకంతే. అంతే చెప్పాడు"

ఓ రెండు సెకండ్ల నిశ్శబ్దం తరువాత "అన్నట్టు, మేఘన నీ గురించి అడిగింది." అంటూ అమ్మ కబుర్లు చెప్తుండగా ఇల్లంతా వెదికాను. ఎక్కడా ఒక్క దేవుడి బొమ్మకూడా కనబడలేదు.

"అమ్మ, అన్నయ్య ఇంట్లో దేవుడి గదిలేదా?" అడిగాను.

"ఏమో నమ్మా, నాకు తెలీదు. నిన్న మొన్న అన్నయ్య ఇంట్లో ఉన్నప్పుడు అడగపోయావా?"

"నిన్న, మొన్న పగలంతా హడావిడిగా గడిచిపోయింది. ఇవాళ దీపం వెలిగిద్దాం అంటే వత్తులు కూడా దొరకట్లేదు"

"ఇవాళ్ళ అన్నయ్యని కనుక్కుని రేపు వెలిగించులే"

"సరే. ఇంకా?"

"ఇంకా ఏముంది. నిద్రొస్తుందిరా. రాత్రికి చుట్టాలతో మాట్లాడ్డం మర్చిపోకు"

"సరైతే మర్చిపోనులే. గుడ్ నైట్"

ఫోన్ పెట్టగానే టైం చూసా. అన్నయ్య ఇంటికి రావడానికి ఇంకా ఆరుగంటలుంది. నాదే రాజ్యం. ఫ్రిడ్జ్ తెరిచి చికెన్ నగ్గెట్స్‌ని, వెజిటేరియన్ ఫిష్ ఫిల్లెట్‌ని అన్నయ్య చెప్పినట్లు వేడిచేసి, ప్లేట్‌లో హాట్‌సాస్ వేసుకున్నాను. అది నిజమైన ఫిష్‌లా అనిపించి వెంటనే పడేసి పదిసార్లు చెయ్యి కడుక్కున్నాను. నెట్‌ఫ్లిక్స్ అంతా వెతికి 'వన్స్ అపాన్ ఎ టైం' చూడ్డం మొదలుపెట్టాను. వంట చేస్తూ, టీవీ చూస్తూ, ఫేస్ బుక్ చూస్తూ ఎంత కాలక్షేపం చేసినా నిన్నటి అనుభూతి ఇంకా స్ఫురిస్తుంది. ఆ అనుభూతి మళ్ళీ కావాలనిపించింది. అన్నయ్య బుక్ షెల్ఫ్‌లో వెతకడం మొదలు పెట్టాను. జార్జ్ అమాడే, ఒమార్ కబీజస్, గేబ్రియల్ గార్సియా మార్ కేజ్, ఏంటోనియో సిస్ నెరోస్, ఏగ్నేస్ కూపర్, డా.ఎల్స్ రో, జెఫ్రీ ఆర్చర్.. మొత్తానికి ఒక్క తెలిసిన పేరు నవల పేరు పెయింటెడ్ హౌస్. హమ్మయ్య అని చదవడం మొదలుపెట్టాను. కానీ ఐదు నిమిషాలకే ఆవులింతలు మొదలయ్యాయి. పుస్తకాలు చదివే శక్తి కోల్పోయావా? ఆ అనుభూతికి కేవలం ఒక్కసారికే పరిమితమా? ఆ ముచ్చట కనీసం మూన్నాళ్ళు కూడా లేదా? అని దిగులులోకి జారుతుండగా, ఒక్క రాయి వేద్దాం అని మరో సిడ్నీ షెల్డన్ నవలనే తీసుకున్నాను. 'బ్లడ్ లైన్' అన్న పేరు నాకు అంతగా నచ్చే నవలలా అనిపించలేదు. కానీ మొదటి పేజీ తెరిచాను. ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

ముగ్గురు అన్నదమ్ముళ్ళు మూడు దేశాల్లో స్థిరపడి ఆ దేశాల్లోని కొత్త టెక్నాలజీని ప్రతి సంవత్సరం మిగతా ఇద్దరితో పంచుకోవడమే కాక వారి తరవాత జెనరేషన్ కూడా దాన్ని పాఠించడం నాకు ఎంతో నచ్చింది. ఎలిజబెత్‌ని ఎంత అందంగా ఊహించుకున్నానో వివియన్‌ని అంత అంద విహీనంగా ఊహించుకున్నాను. అన్నయ్య చెప్పినట్టు ఒకేసారి పుస్తకమంత కాక ప్రతి 50 పేజీలకి ఒక అరగంట విరామం తీసుకోవాలని నిశ్చయించుకున్నాను. ఎంతో ఆసక్తిగా ఉండడం వల్ల కొన్నిసార్లు ఓ పదిపేజీలు అటూ ఇటూ అయినట్లుగానే అరగంట కూడా తగ్గి పదినిమిషాలయ్యింది. ఇంతలో మొట్టమొదటిసారిగా నా ఫోన్ రింగ్ అయ్యింది. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను.

"టెన్ మినిట్స్‌లో ఇంటి బయట ఉంటాను. టీపాయ్ మీద ఇంటి కీస్ ఉన్నాయి. లాక్ చేసి వస్తావా?" ఫోన్‌లో అన్నయ్య అడిగాడు.

"అప్పుడే వచ్చేస్తున్నావా?" ఆశ్చర్యపోయాను.

"ఆఫీస్ అయిపోయింది. టైం 5.30"

"టైం 5.30 అయ్యిందా? టైం చూసుకోలేదు. సరే కిందుంటాను" గబుక్కున బట్టలు మార్చుకుని తలుపుకి తాళం వేసి కిందకి వెళ్ళాను.

"ఏం చేసావు ఇవాళ? బోర్ కొట్టిందా?" కారెక్కగానే అన్నయ్య అడిగాడు.

"లేదు. అమ్మతో మాట్లాడాను. వంట చేసాను, నెట్‌ఫ్లిక్స్‌లో వన్స్ అపాన్ ఎ టైం కొన్ని ఎపిసోడ్స్ చూసాను. తరువాత సిడ్నీ షెల్డన్ బ్లడ్‌లైన్ మొదలు పెట్టాను."

"ఓ ఫినిష్ చేసేసావేంటి?"

"లేదన్నయ్యా. బ్రేక్స్ తీసుకుంటూ చదువుతున్నాను. కానీ చాలా కష్టంగా ఉంది. ఇప్పుడు కూడా బ్రైన్‌లో అదే తిరుగుతుంది."

"మొదట్లో అలానే ఉంటుంది. నెమ్మదిగా అలవాటౌతుంది. అమ్మేమంటుంది?"

"రాత్రి పెద్దనాన్నకి. అమ్మమ్మకి ఫోన్ చేసి మాట్లాడమంది. పిన్నితో మాట్లాడకని చెప్పింది"

"అదేంటి?"

"నా గురించి పిచ్చిగా మాట్లాడిందట" కళ్ళల్లో నీరు ఏర్పడ్డాయి.

"నీ గురించా?" ఆశ్చర్యపోయాడు.

"ఔను. జుట్టు కత్తిరించుకున్నా అని తెలిసి అమెరికాకి వచ్చాక షోకులు పెరిగి పోయాయని ఏవో చెప్పిందట అందరికి ఫోన్ చేసి"

పెద్దగా నవ్వి "అంతేకదా. అది నార్మలే. వాళ్ళ పిల్లలు అమెరికాకి రావడానికి ఎంత ట్రై చేసారో గుర్తులేదా? అబ్బాయికి వీసా నాలుగు సార్లు రిజెక్ట్. అమ్మాయికి చదువే అంతంత మాత్రం. నువ్వు వచ్చావని కుళ్ళు పుట్టుంటుంది. పోనీ దీంతో నీ జుట్టుకి తగిలిన దిష్టిపోయిందనుకో" అన్నయ్య వివరించాక పిన్ని అలా ఎందుకు అందో అర్థమై గుండె కాస్త కుదుటపడింది.

"ఇంట్లో వత్తులు కానీ అగర్బత్తి కానీ లేవా?" అడిగాను.

"దేనికి?"

"పొద్దున్న స్నానం చేసాక దీపం వెలిగిద్దామంటే కనబడలేదు."

"నాకు వాటిమీద నమ్మకం లేదు"

"మరి ఎలా?"

"ఏది ఎలా?"

"దండం పెట్టుకోవా?"

"ముఖ్యమైన మీటింగ్‌కి ముందు రోజూ పెట్టుకుంటాను. కానీ విగ్రహారాధన దండగ. దీపాలు, అగర్బత్తులు, పువ్వులు, కాయలు కావాలని దేవుడు నాతో చెప్పలేదు. ఇన్‌ఫాక్ట్, అందరింట్లో అలానే ఉండి ఉండి బోర్ కొట్టిందట" ఎగతాళి చేసాడు.

"పాపం తగులుతుంది" కోప్పడ్డాను.

"మరి ఏంటి? భక్తి మనసులో ఉండాలి. చేతల్లోకాదు. వత్తులు, నూనె లేకపోతే ఓ కేండిల్ వెలిగిచ్చుచ్చుకదా? అందులో ఉండేదీ వొత్తే. అది వెలిగేదీ నిప్పుతోనే. విగ్రహం, ఫోటోలూ లేవంటే ఫోన్‌లో గూగుల్ చెయ్యచ్చుకదా? అయినా మనసులో తలచుకుంటే ఇంకా పవర్‌ఫుల్. అదిలేదు, ఇది లేదు అని సాకులు వెతకడం బదులు కళ్ళు మూసుకుని 'శ్రీరామ రామ రామేతీ' అనుకుంటే సరి"

అన్నయ్య చెప్పిందాంట్లో అర్థం తెలిసింది కనక ఇంకేమీ మాట్లాడలేకపోయాను.

"వచ్చేసాము. పద, లోపలికెళ్ళి నీకు నికొలస్ స్పార్క్స్ నవలలు తీసుకుందాం."

"బావుంటాయా?"

"ఒకటి రెండు చదివాను. బానే ఉంటాయి. నీకు నచ్చుతుందిలే."

లోపల షెల్ఫ్‌లో నికొలస్ స్పార్క్స్ రాసిన పుస్తకాల్లోంచి ఎవాక్ టు, రిమెంబర్, ది లకీ వన్, ది రెస్క్యూ తీసుకుని అన్నయ్యకి ఇచ్చాను. ఆ పుస్తకాలని సెల్ఫ్ చెకౌట్ ఎలా చెయ్యాలో అన్నయ్య నేర్పిస్తూ "నువు వెళ్ళగానే ఎవరినైనా అడిగి ఇండియానాలో లైబ్రరీ మెంబర్ షిప్ తీసుకో. రోజుకి ఓ పాతిక పేజీలు చదవాలని టార్గెట్ పెట్టుకో. నవలలేకానీ ఏరో స్పేస్‌కి సంబంధించినవి కూడా చదువుకో, హెల్ప్ అవుతుంది" సలహా ఇచ్చాడు.

చదువుకి సంబంధించినవి చదవచ్చనే ఆలోచనే నాకు తట్టలేదు. కేవలం టెక్స్ట్ బుక్స్ దగ్గరే నా బుర్ర ఆగిపోయింది.

"చదవడం మానేస్తే మళ్ళీ సులువుగా అలవాటవ్వదు. మంచి హేబిట్‌ని మానకూడదు" అంటూ కారు స్టార్ట్ చేసి ఇంటికి బయలుదేరాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story